క్లుప్తంగా

విద్యుత్ మీటర్ రీడర్ల ధర్నా

అమలాపురం రూరల్: విద్యుత్ సంస్థలో మీటర్ రీడర్స్‌గా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి నెల వారీ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వారు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. విద్యుత్ సంస్థనే నమ్ముకొని సుమారు 10 నుంచి 15 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని స్మార్ట్ మీటర్ల వల్ల ఉపాధి కోల్పోతామని జిల్లా అధ్యక్షుడు పి.నాగ వీరవెంకట సత్యనారాయణ, బత్తుల రాజు, ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. రోడ్డున పడకుండా ఆదుకోవాలన్నారు. మీటర్ రీడర్లకు ఎస్క్రో అకౌంట్ ద్వారా ప్రతి నెల వేతనాలు చెల్లించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో ఎ.శేయశేఖర్, వీర మణికంఠ, ఎం.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానం



నేత్రదానం చేసిన ధూళిపూడి సీతా సత్య నాగేశ్వరరావు

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామానికి చెందిన రిటైర్డ్ మాస్టారు ధూళిపూడి సీతా సత్య నాగేశ్వరరావు సోమవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త ధూళిపూడి బాబి నాగు మాస్టారు కుటుంబ సభ్యుల అంగీకారంతో కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ఐ బ్యాంక్ మేనేజర్ నానాజీ, వీరేంద్రలు కార్నియాలను సేకరించారు. ఇంతటి విషాద సమయంలో కూడా కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం వల్ల ఇద్దరు కార్నియల్ అంధత్వంతో చీకటి జీవితం గడుపుతున్న వారి జీవితంలో వెలుగులు నింపారని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

ముమ్మిడివరం: మండలంలో సోమవారం పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ముమ్మిడివరం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, అయినాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఠానేల్లంక ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో ఐదు పరీక్షా కేంద్రాల్లో లెక్కలు పరీక్ష నిర్వహించారు. మండలంలో మొత్తం 753 మంది విద్యార్థులకు గాను 751 మంది హాజరయ్యారు. అమలాపురం డీవైఈవో జి.సూర్యప్రకాశం అయినాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

పరీక్షా కేంద్రాల తనిఖీ



కాట్రేనికోన జెడ్పీహెచ్ పాఠశాల కేంద్రంలో తనిఖీ చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి సలీమ్ బాషా

కాట్రేనికోన: మండలంలోని కాట్రేనికోన, చెయ్యేరు పదో తరగతి పరీక్షా కేంద్రాలను సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సలీమ్ బాషా ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలో 574 మంది విద్యార్థులకు గణితం పరీక్షలకు 572 మంది హాజరయ్యారు. జెడ్పీహెచ్ పాఠశాల కందికుప్పలో 243 మందికికి 243 మంది విద్యార్థులు, జెడ్పీహెచ్ పాఠశాల కాట్రేనికోనలో 177కి 177 మంది, జెడ్పీహెచ్ పాఠశాల చెయ్యేరులో 154 మందికి 152 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనారు.

కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

అమలాపురం టౌన్: ఎస్సీ వర్గీకరణ ఫలాలను మాదిగలకు అందించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి బాబూ జగ్జీవన్ రామ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం జరిగింది. స్థానిక బుచ్చెమ్మ అగ్రహారం శివారులో గల లేఅవుట్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు మడికి శ్రీరాములు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగకు మాదిగ ఎంప్లాయిస్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మడికి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కొరుకూరి కృపావరం, మోకాటి సత్యనారాయణ, కె.వర్గీస్, సీహెచ్. సుధాకర్, కవి సీలి సంసోను, అధ్యాపకుడు సిర్రా కాంతరాజు పాల్గొన్నారు.

కేబినెట్ ఏకపక్ష నిర్ణయానికి వ్యతిరేకంగా ధర్నా

అమలాపురం రూరల్: వర్గీకరణకు వ్యతిరేకంగా కేబినెట్ ఏక పక్ష నిర్ణయానికి వ్యతిరేకంగా బహుజన సమాజ్ పార్టీ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించింది. ప్రధాన కార్యదర్శి బూసి జాన్ మోషే మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా దేశ ప్రజల మధ్య విభజన రేఖలు సృష్టించి తిరిగి కుల భారతాన్ని నిర్మించాలనే మనువాదుల కుట్ర అని అన్నారు. రిజర్వేషన్ల వర్గీకరణ వల్ల ఎస్సీ సామాజిక వర్గాలకు నష్టమే తప్ప ఏ విధమైన ప్రయోజనం లేదన్నారు. జిల్లా ఇన్‌చార్జి కాశీ లక్ష్మీ భవాని, జిల్లా ఉపాధ్యక్షుడు వాకపల్లి భీమారావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోలా త్రిమూర్తులు, పొలమూరి మోహన్ బాబు,పెండెం శ్రీను, జేడీఎస్ రాజు,తాడి రాంబాబు,ములపర్తి చందు,కుసుమ సత్యనారాయణ,ఆకుమర్తి భూషణం కోశాధికారి జానిపెల్లి నాని, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా నియంత్రణ అధికారి డాక్టర్ భారతిలక్ష్మి
- అమలాపురంలో ఆలోచింపజేసిన అవగాహన ర్యాలీ



అమలాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న భారతలక్ష్మి తదితరులు



తాళ్లరేవులో ర్యాలీ నిర్వహిస్తున్న భీమాబాయి మహిళా మండలి సభ్యులు

అమలాపురం టౌన్: ప్రతిఒక్కరూ క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ సీహెచ్‌వీ భారతలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సోమవారం జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ భారతలక్ష్మి మాట్లాడారు. సమావేశానంతరం ఆస్పత్రి ఆవరణ నుంచి నల్ల వంతెన వరకూ క్షయ వ్యాధి నియంత్రణపై నినాదాలతో వైద్యులు, వైద్య సిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీ అందరినీ ఆలోచింపచేసింది. ఈ సంవత్సరం ‘అవును టీబీని అంతం చేయవచ్చుననే’ ఇతి వృత్తంతో అంకిత భావం, కార్యాచరణ అనే అంశాలతో విస్తృత ప్రచారం చేస్తున్నట్టు డాక్టర్ భారతలక్ష్మి తెలిపారు. ఈ అవగాహన సమావేశం, ర్యాలీలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, డాక్టర్ సుమలత, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ డాక్టర్ జాన్‌లెవీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన

తాళ్లరేవు: సమాజంలో అత్యంత ప్రమాదకరమైన క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని భీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వి.నందివర్ధన పిలుపునిచ్చారు. సోమవారం తాళ్లరేవు కార్యాలయంలో క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. అదేవిధంగా గాడిమొగలో వైద్యులు జయభార్గవి, శ్యామల ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ కుమార్, రంజన్ హెచ్‌వీ లక్ష్మి, విజయకుమారి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన అవసరం

యానాం: క్షయవ్యాధిపై సామాజిక అవగాహన కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉందని జిప్‌మెర్ ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి ఆనంద్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిప్‌మెర్‌లో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. క్షయవ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలామంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యాధి ప్రాథమిక దశలోనే చికిత్స పొంది రెగ్యులర్‌గా మందులు తీసుకుని సరైన పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా వ్యాధిని నివారించవచ్చునన్నారు. అనంతరం క్షయవ్యాధి నివారణపై పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా స్థానిక యానాం జిజిహెచ్‌లో డిప్యూటీ డైరెక్టర్ రవి శంకర్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.



క్షయవ్యాధి నివారణపై జిప్‌మెర్ నర్సింగ్ సిబ్బంది ప్రదర్శన

ఇల్లు కాదు.. శ్మశాన వాటికే..



ఇంటిని, వాకిలిని తలపించే రీతిలో అభివృద్ధి పనులను జరుగుతున్న అమలాపురం శ్మశాన వాటిక

అమలాపురం టౌన్: ఈ ఫొటోలో కనిపిస్తున్న అభివృద్ధి పనులు ఓ ఇంట్లో జరుగుతున్నాయి అనుకుంటున్నారా.. అనుకుంటే పొరపాటే అది ఇల్లు కాదు శ్మశాన వాటిక. అమలాపురం మున్సిపల్ డంపింగ్ యార్డ్ వద్ద ఇన్నాళ్లూ అభివృద్ధికి నోచుకోక నిరుపయోగంగా ఉన్న ఈ శ్మశాన వాటికను ప్రస్తుతం అద్దంలా అభివృద్ధి చేస్తున్నారు. మున్సిపల్ కౌన్సిల్ చొరవతోపాటు ఈ శ్మశానంపై ఆధార పడిన 12 వార్డుల ప్రజలు, పార్టీలకు అతీతంగా నాయకులు చేసిన పోరాటంతో హిందూ శ్మశానం ఇలా కొత్త పుంతలు తొక్కుతోంది. మున్సిపాలిటీ రూ.10 లక్షలతో శ్మశానంలో చేపట్టిన అభివృద్ధి సమష్టి కృషికి ఓ తార్కాణం. శ్మశానంలో అంతర్గత రోడ్లు నిర్మితమయ్యాయి. నేలన్నది కనిపించకుండా గ్రావెల్, క్వారీ డస్ట్‌తో అందంగా పరుస్తున్నారు. శవాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ప్రత్యేక శాల, తపో దీక్షలో ఉన్న శివుడు విగ్రహం, జల్లు స్నానాలు, ఎదురుగా ప్రవహించే ప్రధాన పంట కాలువలో పావంచాల, కూర్చునేందుకు సిమెంట్ బల్లలు ఇలా అభివృద్ధి సాకారం అవుతున్న ఆ శ్మశానం త్వరలో ప్రజలకు అసలైన పూర్తి స్థాయి సేవలు అందించనుంది.

ముంపు నివారణకు పరిష్కారం చూపండి

- ఓఎన్జీసీ నుంచి మంచినీటి కాలువకు డ్రైన్ నిర్మించండి
- కలెక్టర్‌కు రైతుల మొర

అల్లవరం: ఓడలరేవు సముద్ర తీరంలో చమురు కార్యాకలాపాలు నిర్వహిస్తున్న ఓఎన్‌జీసీకి టెర్మినల్ నిర్మాణం నిమిత్తం వందల ఎకరాల భూమిని ఇచ్చిన పాపానికి ఓడలరేవు గ్రామంలో ఏడాది పొడువునా ముంపులో చిక్కుకుని కొబ్బరి తోటలు, సరుగుడు, పంట పొలాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆ గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్ మహేష్ కుమార్‌కు సోమవారం మొర పెట్టుకున్నారు. ఓఎన్‌జీసీ టెర్మినల్ నిర్మాణంతో మురుగు నీరు దిగే నాళాలు మూసుకుపోవడంతో ఏడాది పొడువునా ముంపు ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ముంపు ప్రభావంతో వంద ఎకరాలకు పైగా కొబ్బరి తోటలు పూర్తిగా దెబ్బతిని పంట దిగుబడి గణనీయంగా పడిపోయాయని కలెక్టర్‌కు వివరించారు. ముంపు నివారణ కోసం ఓఎన్‌జీసీకి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా మూడు ఎస్సీ, ఒక బీసీ కాలనీకి ముంపు బెడద తప్పడం లేదన్నారు. ఓఎన్‌జీసీ సంస్థ కారణంగా మా పంటలు దెబ్బతిన్నాయని, ఆ సంస్థ నుంచి నష్టపరిహారం ఇప్పించాలని కలెక్టర్‌ని కోరారు. ఓఎన్‌జీసీ స్పందించి ముంపు నివారణ కోసం ఓఎన్‌జీసీ ప్లాంట్ నుంచి పంచనీటి కాలువలోకి డ్రైన్ నిర్మాణం చేయాలని, ముంపు వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని చొల్లంగి రాధాకృష్ణ, బి.సత్యనారాయణ, పెచ్చెట్టి సత్యనారాయణ, నల్లి ఏడుకొండలు, ఈశ్వరబాబు, మోహన్‌కుమార్, తదితరులు కోరారు.

రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన



విలసవిల్లిలో శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: విలసవిల్లి గ్రామంలో వడ్డివారిపేట నుంచి భీమనగర్ వరకు వెళ్లే మార్గానికి రూ.10 లక్షలతో మెటల్‌రోడ్డు, అదే గ్రామంలో ఉన్న శివాలయం కాలనీలో రూ.4లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాలకు గ్రామ సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి సోమవారం శంకుస్థాపనలు చేశారు. దళిత ప్రజలు నివసించే ఈ ప్రాంతాల్లో గత 40 ఏళ్లుగా రోడ్డు సౌకర్యం కొదవయ్యిందని, వారి కష్టాలను దృష్టిలో పెట్టుకుని సర్పంచ్ ఎన్నికల ముందు హామి ఇవ్వటంతో 15 వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నామని సర్పంచ్ ఊర్మిళాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, బీర శాంతకుమారి, వడ్డి దర్మేష్, బీర నరసింహమూర్తి, భీమవరపు సురేష్, చింతపల్లి గిరి, వస్కా మల్లేష్, వడ్డి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్రాజెక్టు, సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన



మట్టాడి పాలెంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవి తదితరులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఏఐఐబీ నిధులతో నిర్మిస్తున్న వాటర్ ప్రాజెక్టు కోసం ప్రతిపాదించిన స్థలాన్ని అమలాపురం ఆర్డీఓ కే మాధవి సోమవారం పరిశీలించారు. సుమారు 161.56 కోట్లతో వాటర్ ప్రాజెక్టు నిర్మించనున్నారు. ఇందులో బాగంగా ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ కింద ఏడు సంవత్సరాలకు గాను రూ.29.87 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈమేరకు ప్రాజెక్టు నిర్మాణం, సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం నగర పంచాయతీ పరిధి మట్టాడి పాలెంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు కొంత స్థలాన్ని సూచించారు. దీంతో ఆర్డీఓ మాధవి ఆ స్థలాన్ని పరిశీలించి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. కమిషనర్ పి.రవివర్మ, తహసీల్దార్ ఎంపీఎస్‌లక్ష్మి, పీవీ సుధాకర్, డీటీ గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో సభ్యుల నిరసన

పీడబ్ల్యూడీ మంత్రి రాజీనామాకు డిమాండ్

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీలో సోమవారం గందరగోళం నెలకొంది. డీఎంకే, కాంగ్రెస్ పార్టీల సభ్యులు వివిధ సమస్యలపై నిరసన తెలియజేసి బైఠాయించడంతో మార్షల్స్ వారిని బలవంతంగా సభ నుంచి బయటకు తీసుకువెళ్లారు. ఆదివారం పీడబ్ల్యూడీ శాఖకు సంబంధించిన నిర్మాణ పనుల్లో జరిగిన అవినీతి నేపథ్యంలో పీడబ్ల్యూడీ చీఫ్ ఇంజినీర్ ఎం.దీనదయాళన్‌తో సహా ముగ్గురు అధికారులను సీబీఐ అరెస్ట్ చేసింది. దీంతో సభ ప్రారంభించిన వెంటనే పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ రాజీనామా చేయాలని డీఎంకే ఎమ్మెల్యే శివ డిమాండ్ చేశారు. అయితే స్పీకర్ సెల్వం జోక్యం చేసుకుని సభ్యులు నిశ్శబ్దం పాటించాలని కోరారు. అయితే డీఎంకే, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తదితరులు లక్ష్మీనారాయణ రాజీనామా చేయాలని నినాదాలు చేస్తూ బైఠాయించారు. అనంతరం వారిని మార్షల్స్ బలవంతంగా బయటకు తీసుకువెళ్లారు .

ప్రమాద బీమా చెక్కు అందజేత



ప్రమాద బీమా పరిహారం నమూనా చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే దాట్ల

ఐ.పోలవరం: తపాలాశాఖ అనుబంధ సంస్థ ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంక్ ద్వారా ప్రమాద బీమా పాలసీ చేసుకున్న పశువులంక గ్రామం ముమ్మిడివరం మండలం నివాసి మోర్తా సాయి కుమార్ కుటుంబానికి సోమవారం బీమా పరిహారాన్ని అందజేశారు. గత సెప్టెంబర్‌లో ప్రమాదవశాత్తు ఎలక్ట్రికల్ షాక్ ద్వారా మరణించిన సాయికుమార్ కుటుంబానికి ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పరిహారాన్ని అందించారు. తపాలా శాఖ అధికారులు మాట్లాడుతూ ప్రమాద బీమా పాలసీ సంవత్సరానికి కేవలం రూ.755 కట్టడం ద్వారా రూ.15 లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కలపాల రాజకుమార్, మేనేజర్ బాలాజీ, పోస్టల్ ఇనస్పెక్టర్ వంశీ, స్థానిక నాయకులు చెల్లి అశోక్, తాడి నరసింహారావు, సఖిలే రాజు, ముదునూరి రామలింగరాజు తదితరులు పాల్గొన్నారు.

పొనుగుమట్లకు కవితా పురస్కారం



పొనుగుమట్లను సత్కరించిన కవిసంధ్య, సాహితీ పౌండేషన్, ప్రముఖ కవులు

యానాం: ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని కవిసంధ్య, చిన్నినారాయణరావు సాహితీ పౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కవితల పోటీలో యానాంకు చెందిన కవి పొనుగుమట్ల అశోక్‌కుమార్ రచించిన కవితకు ప్రోత్సాహక బహుమతి లభించింది. ఈ మేరకు హైద్రాబాద్ లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సెమినార్ హాలులో సోమవారం జరిగిన ప్రపంచకవితాదినోత్సవ సభలో కవి పొనుగుమట్లకు ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ ఎన్ గోపీ, దర్భశయనం శ్రీనివాసాచార్య, డాక్టర్ కొప్పర్తి వెంకటరమణమూర్తి, సుధామ, కవిసంధ్య అధ్యక్షుడు డాక్టర్ శిఖామణి శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రాన్ని, మెమోంటోని అందజేశారు. ప్రముఖ కవులు డాక్టర్ ప్రసాదమూర్తి, డాక్టర్ కోయి వెంకటేశ్వరరావు, చిన్నినారాయణపౌండేషన్ అధ్యక్షుడు నారాయణరావు అశోక్‌కుమార్‌ను అభినందించారు.

పోక్సో చట్టంపై అవగాహన



పోక్సో చట్టంపై మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి నరేష్

అమలాపురం రూరల్: పోక్సో చట్టం మహిళల బాలికల రక్షణ అందిస్తుందని జిల్లా న్యాయమూర్తి వి.నరేష్ అన్నారు.మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో అమలాపురం మహిళా సమాఖ్యలో సోమవారం పోక్సో చట్టంపై అవగాహన శిబిరం నిర్వహించారు. జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ చట్టం గురించి మహిళలు బాలికలు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ వీరబాబు, రూరల్ సీఐ శ్రీ ప్రశాంతకుమార్, న్యాయవాదులు వీకేఎస్ భాస్కరశాస్త్రి, కేవీవీ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ శాంతాకుమారి ప్రసంగించారు.

కుళాయి చెరువు గట్టు ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు రక్షిత మంచినీటి పథకం కుళాయి చెరువుగట్టును ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, ప్రధాన కార్యదర్శి బొంతు మోహన్, సీపీఎం మండల కార్యదర్శి టేకుమూడి ఈశ్వరరావు తదితరులు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుకీర్తితో కలిసి మంచినీటి చెరువును పరిశీలించారు. ఆదివారం రాత్రి పొక్లెయిన్‌తో కొంతమంది వ్యక్తులు చెరువుగట్టును తవ్వేశారని తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారం గట్టును తవ్వడంతోపాటు, ఫెన్సింగ్‌ను తొలగించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల వెంకటేశ్వర్లు, వాకపల్లి చిరంజీవి, కొండిశెట్టి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, విత్తనాల పండు, జక్కల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల విన్నర్‌గా కలెక్టరేట్ బృందం



విజేతగా నిలిచిన కలెక్టరేట్ బృందానికి ట్రోఫీని అందిస్తున్న కలెక్టర్ జేసీ తదితరులు

అమలాపురం రూరల్: అంబేద్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో కలెక్టరేట్ బృందం విన్నర్‌గా నిలిచిందని, అమలాపురం డివిజన్ బృందం రన్నరగా ఎంపికైందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ డీఆర్ఓ బీఎల్ అండ్ రాజకుమారి కలెక్టరేట్ పరిపా లనాధికారి కడలి కాశీ విశ్వేశ్వరరావు పర్యవేక్షణలో క్రీడలు ఉత్సాహభరితంగా బాలయోగి స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించారన్నారు. విన్నర్స్ రన్నర్స్ బృందాలకు షీల్డ్‌లను కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి బహూకరించారు. క్రీడలకు వ్యాఖ్యాతగా ఎస్పీ భరత్ వ్యవహరించారన్నారు. రెవెన్యూ ఉద్యోగులు రెట్టించిన ఉత్సాహంతో క్రికెట్ క్రీడలో పాల్గొని ప్రతిభను చాటారన్నారు. కలెక్టరేట్ బృందానికి కెప్టెన్‌గా కలెక్టరేట్ ఉద్యోగి కిషోర్ వ్యవహరించగా అమలాపురం డివిజన్ బృందంకు కెప్టెన్‌గా శివ వ్యవహరించారాన్నారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా కిరణ్, బెస్ట్ బౌలర్‌గా కృపా పాల్ గుర్తింపు పొందారన్నారు.

విశ్రాంత టీచర్ మృతికి సంతాపం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రభుత్వహైస్కూల్స్‌లో విద్యాసేవలు అందించిన విశ్రాంత టీచర్ ధూళిపూడి సీతాసత్య నాగేశ్వరరావు(72) మృతికి ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, పలువురు టీచర్లు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఎంజీబీటీ హెచ్‌స్కూల్, కేఎన్‌జీజీ, రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హైస్కూల్ తదితరచోట్ల ఆయన మ్యాథ్స్ టీచర్‌గా సేవలు అందించారు. పి మల్లవరంలో ఆయన స్వగృహంలో అనారోగ్యంతో నాగేశ్వరరావు మృతి చెందారు.

ఉగాది నంది పురస్కారానికి ఏడుకొండలు ఎంపిక



ఏడుకొండలు

తాళ్లరేవు: పాన్ ఇండియా సోషియో కల్చర్ అసోసియేషన్ అందించే ఉగాది నంది జాతీయ ప్రతిభా పురస్కారానికి విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రపంచ శాంతి అవార్డు గ్రహీత వడ్డి ఏడుకొండలు ఎంపికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ అద్దంకి రాజాయోనా నుంచి సోమవారం ఉత్తర్వులు అందినట్టు ఏడుకొండలు ఒక ప్రకటనలో తెలిపారు. సుంకరపాలెం గ్రామానికి చెందిన ఏడుకొండలు గత 15 ఏళ్లుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో తనవంతు కృషి చేస్తున్నారు. ఏటా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్నారు. అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు, దళితులపై జరుగుతున్న అక్రమాలపై అనేక ఉద్యమాలు చేస్తూ పోరాటాలు సాగిస్తున్నారు. ఏప్రిల్ 4న రాజమండ్రిలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక, సినీ ఫొటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. నంది ఉగాది పురస్కారానికి ఎంపికైన ఏడుకొండలును పలువురు అభినందించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

అల్లవరం: దేవగుప్తం సబ్ స్టేషన్ పరిధిలో గుండెపూడి, తూర్పులంక, రెల్లుగడ్డ గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ రాంబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవగుప్తం సబ్ స్టేషన్ నుంచి తూర్పులంక వరకు 11 కేవీ కొత్త లైన్ నిర్మాణం నిమిత్తం విద్యుత్ సరఫరా నిలపివేస్తున్నట్టు తెలిపారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ ధర్నా

అమలాపురం రూరల్: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈసందర్భంగా డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ మహేస్ కుమార్‌కు సమర్పించారు. మార్చి 31 తో అరబిందో సంస్థ కాంట్రాక్ట్ రద్దు కావడంతో మరో కాంట్రాక్టు వస్తే పాత ఎంప్లాయిస్ ఎవరైతే ఉన్నారో వారందరు కొనసాగించాలని, కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎ.చిన్న బాబు, జి.నాగేంద్ర, జె దుర్గాప్రసాద్, కె.సురేంద్ర కుమార్, ఎ.వెంకటరమణ, దయా మహేష్ ఎం.సూర్య భగవాన్, మహేంద్ర బాబు, వీరబాబు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి సమ్మె

యానాం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నేషనల్ రూరల్ హెల్త్‌మిషన్(ఎన్ఆర్‌హెచ్ఎం) సిబ్బంది తమ డిమాండ్ల సాధన కోసం సోమవారం విధులు బహిష్కరించిన నిరవధిక సమ్మెకు దిగారు. వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాన్ని చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్ఆర్‌హెచ్‌ఎమ్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు

అమలాపురం టౌన్: స్థానిక ఉప్పర కాలనీలో అత్తింటి వారిపై దాడి చేసి హత్యాత్నానికి పాల్పడిన అల్లుడు వేముల ప్రసాద్‌ను సోమవారం అరెస్టు చేసి ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరిచినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బాధ్యత లేకుండా తాగి తిరుగుతున్నాడని భార్య బాల మందిలించిందన్న కోపంతో భర్త ప్రసాద్ ఆమెపై చెక్కబద్దతో దాడి చేసి గాయపరిచాడు. అల్లుడు దౌర్యజాన్ని అడ్డుకుని గొడవను నివారించే ప్రయత్నం చేసిన ప్రసాద్ అత్తమామలు, మరదలను కూడా ఈనెల 22న గాయపరిచిన సంగతి తెలసిందే. పట్టణ ఎస్సై టి.శ్రీనివాస్ నిందితుడిని అరెస్టు చేయడంతోపాటు అతడు నేరం చేసేందుకు ఉపయోగించిన చెక్క బద్దను స్వాధీనం చేసుకుని మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్

కాట్రేనికోన: చెయ్యేరుకు చెందిన ముగ్గురు యువకులు బిర్యానీ కోసం బొండా కోడు తూమ్ వద్ద ఉన్న అమరావతి రెస్టారెంట్‌కు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తూ విద్యుత్‌స్తంభాన్ని ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగిందని కాట్రేనికోన ఎస్సై అవినాష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెయ్యేరు వద్ద జరిగిన ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు మోర్త అవినాష్ 16, సవరపు కృపా కుమార్ 16, కమ్మసత్తి మహేష్ 16లను అమలాపురం కిమ్స్ ఆసుపత్రి తరలించారు. మోర్త అవినాష్‌కు బలమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూపరింటెండెంట్‌ల బదిలీ

యానాం: స్థానిక రీజియన్‌లో వివిధ ప్రభుత్వ శాఖల్లో సూపరింటెండెంట్‌లుగా విధులు నిర్వహిస్తున్న పలువురికి బదిలీ చేస్తూ సోమవారం డీపీఅండ్ ఏఆర్ శాఖ కార్యదర్శి వి.జయశంకర్ ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ కలెక్టర్(రెవెన్యూ)శాఖలో పని చేస్తున్న మహ్మద్ అబ్దుల్ సుభాన్‌ను పుదుచ్చేరి లేబర్ ఆఫీసుకు, విద్యుత్ శాఖలో పని చేస్తున్న పి.సత్యవరప్రసాద్‌ను డీఐఎస్ జోన్–1 పుదుచ్చేరికి, ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న యు.శ్రీనివాసరావును డెలిగేట్ ఆఫీసుకు బదిలీ చేశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

తాళ్లరేవు: మండల పరిధిలోని తాళ్లరేవు, పి.మల్లవరం , గాడిమొగ పంచాయతీలలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి ఎంపీపీ రాయుడు సునీత సోమవారం భూమిపూజ చేశారు. మండల కేంద్రమైన తాళ్లరేవు రచ్చవారిపేట, కేశవపురం కాలనీలో రూ.6 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ సభ్యులు టొమ్మేటి సామ్యూల్‌సాగర్, సర్పంచ్ రెడ్డి అరుణసుహాసినీదేవి, ఎంపీటీసీ సభ్యుడు రచ్చ ముత్యాలు, పి.మల్లవరం సర్పంచ్ పంపన రామకృష్ణ, గాడిమొగ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.